క్లుప్తంగా

మైక్‌సెట్, ప్రొజెక్టర్ బహూకరణ

రఘునాథపల్లి: గోవర్ధనగిరి ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన మిర్యాల సునీత శ్రీకాంత్, ఏవీఎం ట్రస్ట్ చైర్మన్ విజయలక్ష్మిలు సోమవారం మైక్‌సెట్, ప్రొజెక్టర్ అందజేసి ఔదార్యం చాటారు. అలాగే పాఠశాలలోని 86 మంది విద్యార్థుల దుస్తులకు రూ.43 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల: మండలంలోని మైదంచెరువుతండాకు చెందిన ధరావత్ రాజేందర్ కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని రాజేందర్‌కు మనోధైర్యాన్ని కల్పించారు. ఇదే తండాకు చెందిన దివ్యాంగుడు ధరావత్ ప్రతాప్.. ఝాన్సీరెడ్డిని కలిసి తనగోడును విన్నవించుకోగా అర్హత, అవకాశాన్ని బట్టి ప్రభుత్వం ద్వారా సహకారం అందేలా చూస్తానని ఆమె చెప్పారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, సిద్ధూ, సుధీర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జలగం కుమార్‌కు..

పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలగం కుమార్ తీవ్ర అస్వస్థతకు గురవగా ఝాన్సీ రెడ్డి ఆయనను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే తీగారం మాజీ సర్పంచ్ పోగు శ్రీనివాస్ తల్లి పోగు గోపమ్మ మృతి చెందగా గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: మండలంలో ప్లాట్లు ఉన్న వారు ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ వెంకట మల్లికార్జున్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ కార్యదర్శులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాట్లు ఉన్న వారు ఎల్‌ఆర్‌ఎస్‌కు గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి రుసుములో 25 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు అని చెప్పారు. జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తరిగొప్పుల: అక్కరాజుపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.14 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జొన్నగోని నర్సింహులు సోమవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. పంచాయతీ కార్యదర్శి రత్న, నాయకులు పలుచాని రమేష్, గోరంతల వీరన్న, గాలి ఐలయ్య, గొలుసుల రాజు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

లింగాలఘణపురం: ఈ నెల 18వ తేదీన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆత్మీయ సన్మానసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల ఐక్య సమావేశం తీర్మానించింది. సోమవారం మండలంలోని దీప్తి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యమకారునికి అత్యున్నత పద్మశ్రీ అవార్డు రావడం జాతికి గర్వకారణమని, మంద కృష్ణ మాదిగను సన్మానించేందుకు రాజకీయాలకతీతంగా అందరు ఏకం కావాలని కోరారు. సింగపురం జగన్, రవి, యాదగిరి, యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



పాలకుర్తి: విస్నూరు గ్రామ పాఠశాల విద్యార్థులు సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎం మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షితకు అవార్డు



పాలకుర్తి టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రానికి చెందిన అనంతోజు రక్షిత ఇవాంజిల్ రాష్ట్రస్థాయి అవార్డును సోమవారం అందుకున్నారు. టీయూసీపీఏ ఆధ్వర్యాన హైదరాబాద్ నారాయణగూడ బాప్టిస్టు చర్చిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. టీయుసీపీఏ కమిటీ సభ్యులు సాల్మన్‌రాజు, కె హేమలతశాలిని అవార్డును అందజేశారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- ఎన్నిబోర్లు వేసినా చుక్క నీరురాని పరిస్థితి
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలు

జఫర్‌గఢ్: వ్యవసాయ బోరు బావుల కింద ఎంతో ఆశతో రైతులు శ్రమతో పాటు రూ. వేల పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో ఒక్కసారిగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో పంట పొలాలకు నీరందక కొంత పంట ఇప్పటికే ఎండిపోగా ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. రూ.వేల ఖర్చు చేసి బోర్లు వేస్తున్నారు. వేసిన బోర్లల్లో ఎక్కడో ఓ చోట నీరు రాగా ఎక్కువ బోర్లలో నీరురాక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. మండలంలో ఈ ఏడాది అనుకున్న సమయంలో వర్షాలు కురియనప్పటికీ ఆలస్యంగా పడిన వాలనతో చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరింది. దీంతో రైతులు ఖరీఫ్‌తో పాటు ఈ యాసంగిలో బోరు బావుల కింద పెద్ద ఎత్తున వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలను సాగు చేశారు. ఖరీఫ్‌లో బోరు బావుల్లో సమృద్ధిగా నీరు ఉండడం వల్ల రైతులు పంటలు పండించినప్పటికీ అనుకున్న స్థాయిలో దిగుబడులు సాధించకలేకపోయారు. యాసంగిలోనైనా పంట దిగుబడులు రాకుండా పోతాయా అనే ఆశతో అదే బోరు బోవుల కింద ఎక్కువగా వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. ఒక్క సారిగా భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల బోరు బావుల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గముఖం పట్టింది. దీంతో పంటలకు సరిపడా నీరందక కొంత పంట ఎండిపోయింది. ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అదనపు బోర్లపై దృష్టిసారించారు.

ఫెయిలవుతున్న బోర్లు..

ఇప్పటికే అధికారుల లెక్కల ప్రకారం 7,500 బోరు బావులు ఉండగా అనధికారికంగా మరో 1,500 వరకు బోర్లు ఉన్నట్లు అధికారుల అంచనా. ప్రస్తుతం యాసంగి పంటలను కాపాడుకునేందుకు రైతులు అదనపు బోర్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వేసిన బోర్లల్లో ఒక బోరులో నీరు పడకపోతే మరో బోరు కూడా వేసేందుకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా రైతులు వెనుకాడడం లేదు. ఒక్కో బోరు ఫీటుకు రూ.110 నుంచి రూ. 170 ఖర్చు చేయాల్సి వస్తుండడం, పైగా 250 నుంచి 500 ఫీట్ల వరకు బోర్లు వేస్తుండడంతో ఒక్కదానికి రూ. 70 వేల ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎక్కడో ఓ చోట మాత్రమే బోరు సక్సెస్ కావడం, ఎక్కువ శాతం బోర్లలో నీరు రాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఉన్న పంటలు కూడా చేతికి అందే పరిస్థితి కానరాకపోవడంతో



తమ్మడపల్లి (జి) 500 ఫీట్ల వరకు వేసినా చుక్క నీరు రాని బోరు

రైతులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. పైగా దేవాదుల కాల్వల ద్వారా కూడా పంటలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. వీటికి సంబంధించిన కాల్వల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో రైతులు ఉన్న పంటలను ఎలా కాపాడుకోవాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే పంటల సాగు కోసం శ్రమతో పాటు రూ.వేల పెట్టుబడులు పెట్టగా మరోవైపు బోర్ల కోసం మరింత అప్పులు చేసినా ఫలితం కన్పించకపోవడంతో చేసిన బాకీలు ఎలా తీర్చాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

15 రోజుల్లో ఆరు బోర్లు వేశా..



యాసంగిలో బోరు కింద నాలుగు ఎకరాల వరి పంటను సాగు చేశా. ఒక్కసారిగా బోరులో నీరు అడుగంటిపోవడంతో పంటను కాపాడుకునేందుకు 15 రోజుల్లో ఆరు బోర్లు వేయాల్సి వచ్చింది. ఇందులో ఒక బోరులో మాత్రమే నీరు పడింది. బోర్ల కోసం రూ.4 లక్షలు ఖర్చు చేశా. అయినా ఫలితం లేకపోవడంతో మూడు ఎకరాల వరి పంటను ఇప్పటికే వదిలేయడంతో ఎండిపోయింది. ఉన్న ఎకరం వరి పంటకు కొత్తగా వేసిన బోరు ద్వారా నీరు పెడుతున్నా. ఈ యాసంగిలో వరి సాగు వల్ల తీవ్రంగా నష్టపోయా.. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

- పులిగిల్ల నాగరాజు, రైతు, తమ్మడపల్లి (జి)

మూడు బోర్లు వేస్తే చుక్కనీరు రాలే



బోరు బావి కింద రెండు ఎకరాల వరి పంట సాగు చేస్తే ఒక్కసారిగా బోరు బావిలో నీరు అడుగంటిపోయింది. పంట కోసం మూడు చోట్ల మూడు బోర్లు వేశా. ఏ ఒక్క బోరులో కూడా చుక్క నీరు రాలేదు. బోర్ల కోసం రూ. 2 లక్షలు బూడిదలో పోసినట్లు అయ్యింది. ఉన్న పంట కూడా పూర్తిగా ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడులు, శ్రమను కోల్పోయి తీవ్రంగా నష్టపోయా. ప్రభుత్వమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- పెద్దూరి వెంకన్న, రైతు, తమ్మడపల్లి (జి)

ఎండుతున్న పంటలు



ఎండిన పొలంలో జీవాలను మేపుతున్న రైతు

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో నీరందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఈ సంవత్సరం మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 22వేల ఎకరాల వరి పంటను రైతులు సాగు చేశారు. నాటు వేసే సమయంలో కూలీల కొరత ఉండడంతో ఒక్కో కూలీకి రూ.500 నుంచి రూ.600ల వరకు చెల్లించి వరి నాట్లు వేయించారు. నాటు వేసిన కొద్ది రోజుల్లోనే వరి పంటను మోగిపురుగు ఆశించడంతో రైతులు రూ. వేలు ఖర్చు చేసి మందులను పిచికారీ చేసి, సస్యరక్షణ చర్యలు చేపట్టారు. నాటు వేసిన వరి పంట కోలుకునే దశలోనే భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు నీరు తక్కువగా పోస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. మండల కేంద్రంలో వరి పంటలు ఎండిపోగా కొందరు రైతులు జీవాలను మేపుతున్నారు. ఇప్పటికైనా గోదావరి జలాలను అందించి ఆదుకోవాలని, లేని పక్షంతో పెద్ద ఎత్తున పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న రాంబాబు

జనగామ రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీఈఆర్టీ సభ్యుడు ఎం.రాంబాబు, జీసీడీఓ గౌసియా బేగం అన్నారు. సోమవారం జెడ్పీఎస్ఎస్ పెంబర్తి పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఏ-1, ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్ గ్రేడింగ్ రిజిస్టర్ టీచర్ డైరీలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టే విద్యా కార్యక్రమాలను విధిగా పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎం.సుభాష్, ఎ. ఉమాదేవి, వసంత, జ్యోతి పాల్గొన్నారు.

మహిళలను గౌరవిస్తేనే సమాజ పురోగతి

- ఎంఈఓ కళావతి

దేవరుప్పుల: ప్రతీ ఒక్కరూ మహిళలను గౌరవిస్తేనే సమాజం పురోగతిచెందుతుందని ఎంఈఓ జి.కళావతి పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఇంటర్‌నేషనల్ ఉమెన్స్‌డే, సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయినులను, ఎంఈఓను ఘనంగా సన్మానించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి.. సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, పులి గణేష్, ఎర్రబెల్లి రాఘవరావు,ఎండీ మదార్, వీరమానేని యాకాంతరావు, మదాసు హరీష్, ఐలేష్, నీరటి చంద్రయ్య, సలేంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జఫర్‌గఢ్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని హిమ్మత్‌నగర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం మంగు జయప్రకాశ్ అన్నారు. పసోమవారం పాఠశాలలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీచర్లను శాలువలతో ఘనంగా సన్మానించారు.

కేసిరెడ్డిపల్లిలో..

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామ సెకండరీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అప్పుడే సాధికారత సాధించినట్లు అని అన్నారు. అనంతరం మహిళా టీచర్లకు శాలువాలతో సన్మానం చేశారు. హెచ్ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వచ్చేలోపు నిధులు కేటాయించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

పాలకుర్తి టౌన్: పాలకుర్తి రిజర్వాయర్‌కు ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజవర్గానికి వచ్చేలోపు పాలకుర్తి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిలిచిన రిజార్వాయర్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాలకుర్తి రిజర్వాయర్‌కు గత ప్రభుత్వం రూ.66 కోట్ల నిధులు కేటాయిస్తే రూ.18 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. ఇంత వరకు పనులు జరగలేదని అన్నారు. నీరు అందక పొలాలు ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ

పరామర్శ

వీరనారి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనుమడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు చిట్యాల సంపత్, శ్వేతను జాన్‌వెస్లీ పరామర్శించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహానికి జాన్‌వెస్లీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు అబ్బాస్, జిల్లా కార్యదర్శి కనకరెడ్డి, నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చిల్పూరు: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ మండల కార్యదర్శి సాదం రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేశారు. పోలు సంపత్, ఆవుల ప్రభాకర్, సాదం పరమేష్, కర్రె నాగరాజు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



జనగామ: లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త దాసరి ప్రభాకర్ ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన రూ.2.లక్షల బీమా చెక్కును సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతుడి భార్య శిరీషకు అందజేశారు.

చట్టబద్ధత కల్పించాకే నియామకాలు చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ నాయకుడు దయాకర్‌మాదిగ



దీక్షలో మాట్లాడుతున్న దయాకర్‌మాదిగ

రఘునాథపల్లి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు బొడ్డు దయాకర్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఎస్పీ మండల అధ్యక్షుడు సుంచు సురేందర్‌మాదిగ ఆధ్వర్యాన చేపట్టిన నిరసన దీక్షను ప్రారంభించి మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా మాదిగలకే కాకుండా సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంద కృష్ణమాదిగను ఈనెల 18న స్టేషన్‌ఘన్‌పూర్‌లో సన్మానించనున్నట్లు ఏఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో దయాకర్‌మాదిగ పేర్కొన్నారు. ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మల్లేష్‌మాదిగ, సుధాకర్, కుమార్, రవీందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'హామీ నిలబెట్టుకోవాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చాడ ఏలియా డిమాండ్ చేశారు. ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేసేవరకు గ్రూప్-1,2,3లతో పాటు అన్ని రకాల ఉద్యోగ నియామకాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ అధ్యక్షతన చేపట్టిన దీక్షలను బీఆర్ఎస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మారెపల్లి ప్రసాద్, జీడి రమేష్, కలకోల రజనీకాంత్, ఐలపాక శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు శ్రీధర్, నరేష్, యాకస్వామి, శ్రీను, ప్రవీణ్, సమ్మయ్య, గణేష్, గుండె మల్లేష్, ప్రశాంత్, చిట్టిబాబు, రాజశేఖర్ ఉన్నారు.

ఘనంగా బీరప్ప, కామరాతి కల్యాణం



పూజ చేస్తున్న భక్తులు



పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: తమ్మడపల్లిలో జరుగుతున్న బీరప్ప పండుగలో భాగంగా సోమవారం ఒగ్గు బీర్ల పూజారులు బీరప్ప-కామరాతిల కల్యాణం నిర్వహించారు. వధువు కామరాతి బొమ్మను తయారు అలంకరించి, వరుడు బీరప్ప దేవుడిని అలంకరించి డప్పు చప్పుళ్లతో కుల పెద్దల ఇళ్ల నుంచి ఆలయం వద్దకు తీసుకవచ్చారు. అక్కడ సాంప్రదాయంగా ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్నం వేసి కల్యాణం చేశారు. పలువురు నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కుల పెద్దలు అబ్బసాని కుమారస్వామి, మ్యాకల మల్లేశం, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేవెళ్ల సంపత్, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, జిల్లా నాయకులు రాములు, రవికుమార్, మల్లేష్, మధు పాల్గొన్నారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి: ఎమ్మెల్యే పల్లా

మారుతున్న కాలానికి అనుగుణంగా కురుమలు కూడా రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తమ్మడపల్లిలో జరుగుతున్న పెద్ద పండుగలో ఆయన పాల్గొని పూజలను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గొల్లకురుమలకు పెద్ద పీట వేసిందన్నారు. మాజీ సర్పంచ్ మేకల కవితరాజు, నాయకులు అబ్బసాని కుమారస్వామి, మ్యాకల మల్లేశం, రమేశ్, భిక్షపతి, పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్

నర్మెట: ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు బరోసా మాట దేవుడెరుగు సాగు నీరందించక రైతులను నిండాముంచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, జిల్లా మాజీ అధ్యక్షుడు రాష్ట్ర నాయకుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి అన్నారు. మండల కన్వీనర్ చొక్కం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎండిన వరిపొలాలను సోమవారం పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఏడాదికి ఎకరాకు రూ. 15 వేలు రైతుబరోసాతో రాజును చేస్తానన్న రేవంత్ రెడ్డి ఏడాదిగా ఒక్క పైసా ఇవ్వకుండా రైతులను మోసం చేసాడన్నారు. ఎండిన వరికి ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం అందించి ఆదుకోకోలని డిమాండ్ చేశారు. నాయకులు దేవరాయ ఎల్లయ్య, ధరావత్ రాజు, చింతకింది సంతోష్, రాజబోయిన జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రమేశ్

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

జనగామ రూరల్: మహిళలు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. సోమవారం సావిత్రి బాయి వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. పజ్జూరి లక్ష్మీనారాయణ, దేవరాయి ఎల్లయ్య, గుజ్జుల నారాయణ, గోధుమల అశోక్ చింతకింది సంతోష్ , మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: ఈ నెల 16న స్టేషన్‌ఘన్‌పూర్ శివునిపల్లిలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మండలగూడెం, రామరాయనిబంగ్లా, మేకలగట్టు, దాసన్నగూడెం, రఘునాథపల్లి గ్రామాల్లో సభ విజయవంతం కోసం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. ఆయా సమావేశాల్లో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, యూత్ అధ్యక్షులు తాటికాయల రాజేందర్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు లోనె రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిరీష్‌రెడ్డి

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. ఈ నెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో సమన్వయ సమావేశాలను నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు సీహెచ్.నరేందర్‌రెడ్డి, కనకం రమేష్, నాగరబోయిన శ్రీరాములు పాల్గొన్నారు.

ఎన్నిక

రఘునాథపల్లి: కుసుంబాయితండా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా భూక్య రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గ్రామంలో పార్టీ కార్యకర్తలు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవితో పాటు ఉపాధ్యక్షుడు గుగులోతు మల్లేష్, ప్రధాన కార్యదర్శి మూడ్ మోతి, కార్యదర్శి భూక్య లక్ష్మణ్, సభ్యులు గుగులోత్ మల్లు, శ్రీను, మురళి, గుంగు, కిషన్, శ్రీశైలం, రవి, కైలాసం, సుధాకర్, బిచ్చలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా కిశోర్

లింగాలఘణపురం: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా దాసరి కిశోర్ ఎన్నికయ్యారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా కడవెరుగు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా ప్యాట రాజు, కార్యదర్శిగా పగిడిపల్లి ప్రసాద్, సోషల్‌మీడియా ప్రతినిధి గట్టగల్ల బాబు, కార్యవర్గ సభ్యులుగా నరేశ్, మల్లేశ్, శ్రీనాథ్, సతీష్, రాజు ఎన్నికయ్యారు.

సోమేశ్వరాలయంలో పారాయణం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన సౌందర్యలహరి బృందం స్వామివారికి శివానందలహరి, సౌందర్యలహరి, బిల్వాష్టకం, లింగాష్టకం, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షిప్త సమాచారం

హోలీ పేరిట వాహనదారులను ఇబ్బందికి గురి చేయొద్దు

కొడకండ్ల: హోలీ సందర్భంగా రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తూ ఇబ్బందికి గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై చింత రాజు హెచ్చరించారు. హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో నిర్వహించుకొవాలే తప్ప చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల బదిలీ

కొడకండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు సోమవారం బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎ.వెంకటస్వామి హసన్‌పర్తికి, మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ గీసుకొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

బియ్యం వితరణ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో గాయల సోమయ్య మృతి చెందాడు. కాగా సోమవారం బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడవెల్లి సోంమల్లయ్య పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

జఫర్‌గఢ్: రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని తిమ్మంపేట గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనాయక్‌తండాకు చెందిన భూక్య చిట్టిబాబు శ్రీరామ్ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై రాత్రి ఇంటికి వస్తుండగా తిమ్మంపేట గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.


ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

దేవరుప్పుల: అనారోగ్యకారణంగా జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన సోమవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం .. మండలకేంద్రానికి చెందిన తోటకూరి బుచ్చమ్మ (75) కొన్ని సంవత్సరాలుగా ఆస్తమా, వినికిడి లోపంతో బాధపడుతోంది. ఈ విషయమై మనసులో మదనపడుతూ ఉండేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెందిన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో రేకులషెడ్డులోని కడ్డీకి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు తోటకూరి కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసైన్డ్ ల్యాండ్ అన్యాక్రాంతం కానివ్వద్దు

పాలకుర్తి: వావిలాల గ్రామంలోని అసైన్డ్ ల్యాండ్‌ను అన్యాక్రాంతం కాకుండా చూడాలని దళితులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యాకుబ్, వెంకన్న, ఆగయ్య, మహేందర్ ఉన్నారు.

జాజిరి సందడి



జాజిరి ఆడుతున్న చిన్నారులు

బచ్చన్నపేట: హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో చిన్నారులు కోలలతో జాజిరి ఆడుతూ సందడి చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీన హోలీ పండుగ నేపథ్యంలో చిన్నారులు ఇంటింటా తిరుగుతూ జాజిరి ఆడుతున్నారు.

ఆర్థికసాయం



పాలకుర్తి/పాలకుర్తి టౌన్: దాసుగూడెం తండాకు చెందిన కునుసోత్ స్వామినాయక్ మృతి చెందాడు. కాగా, సోమవారం తండా వాసులు బాధిత కుటుంబానికి రూ.41,131, రెండు క్వింటాళ్ల బియ్యం అందజేసి అండగా నిలిచారు. కునుసోత్ శ్రీరామ్, అనిల్, ప్రమిల్, రాజ్‌కుమార్, కుమార్, చందులాల్, చిరంజీవి, డాక్టర్ గౌడ్ నాందేవ్ ఉన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)